సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



**భోజన ఏజెన్సీలకు..**
తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల మధ్యాహ్న భోజన బిల్లులు విడుదలకాకపోవడంతో ఏజెన్సీల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.
- 8లో ▸



**ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్**
వైద్యుల స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగింది. వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.6 /10.6

**వాతావరణం**
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం : ఎమ్మెల్యే



**డిచ్‌పల్లి :** ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో చదువుకుంటున్న గ్రామీణ పేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యాసంస్థలు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 45 శాతం మెస్ చార్జీలను పెంచిందన్నారు. డిచ్‌పల్లి మండలం సుద్దులంలో 25 ఎకరాలలో ఆధునాతన ఇంటిగ్రేటెడ్ టెక్నికల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన సుమారు 3 వేల మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నళిని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాడ్సీ శేఖర్ గౌడ్, మునిపల్లి సాయరెడ్డి, రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలసాని శ్రీనివాస్, నవీన్ గౌడ్, విండో చైర్మన్లు రామకష్ణ, చింత శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వ్యాస రాజేశ్వర్, శాంసన్, వాసు బాబు, వినోద్, నరేష్ పాల్గొన్నారు.

### సమగ్రశిక్ష ఉద్యోగులను ఆదుకోవాలి



**నిజామాబాద్ అర్బన్:** సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని ధర్నాచౌక్‌లో రిలే దీక్షలు చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హనుమకొండలో రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు రాజారాం యాదవ్ మద్దతు పలికారు.

### జిల్లాస్థాయి విశ్రాంత ఉద్యోగుల క్రీడాపోటీలు

**నిజామాబాద్ నాగారం:** నగరంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి అఖిల భారత పెన్షనర్స్‌డే సందర్భంగా జిల్లాస్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనా రాయణ, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి వస్తున్నారన్నారు. పోటీల్లో రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమ్మేళనానికి హాజరైన శ్రీసరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థులు



ఇటీవల జరిగిన సమ్మేళనంలో తమ గురువులతో పోచంపాడ్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థులు



తమ గురువుకు స్వాగతం పలుకుతున్న పూర్వ విద్యార్థులు



# ఆపాతమధురం

- పండగ వాతావరణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- సోషల్ మీడియాతో ఒక్కటవుతున్న చిన్ననాటి స్నేహితులు
- ఒకే వేదికపైకి చేరుకుంటున్న దేశవిదేశాల్లో స్థిరపడిన వారు
- గురువులకు సన్మాన కార్యక్రమాలు
- స్నేహంతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని నిర్ణయాలు
- కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్న స్నేహితుల బృందాలు



తమ టీచర్‌తో పూర్వ విద్యార్థినులు

**ఆర్మూర్ :** దసరా, దీపావళి, క్రిస్మస్, రంజాన్ లాంటి పండుగలు నిర్వహించుకోవడం సనాతన సంప్రదాయాల్లో భాగం.. ఆధునిక పోకడలతో నేటి యువత ఫ్రెండ్‌షిప్ డే, లవర్స్‌డే, మదర్స్ డే, ఫాదర్స్ డే అంటూ ప్రత్యేకమైన రోజులను ఎంపిక చేసుకొని పండుగలు జరుపుకోవడం ప్రారంభించారు.. మరో వైపు కళాశాల విద్యార్థులు చదువులతో పాటు తమ జీవితాల్లో మధురస్మృతులుగా నిలుపుకోవడానికి ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్ డే, యాన్యువల్ డే పార్టీలు నిర్వహించుకుంటున్నారు. ఈ పండగల్లో మరో కొత్త పండుగ 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' చేరింది. సెల్‌ఫోన్, వాట్సప్ గ్రూపుల ద్వారా చిన్ననాటి పాఠశాల, కళాశాలల మిత్రులు ఏకమవుతున్నారు. గెట్ టు గెదర్ పార్టీలను నిర్వహిస్తున్నారు. గురువులకు సన్మానాలు చేస్తూ గురుభక్తిని చాటుతున్నారు. సంప్రదాయ పండుగలను మరిపిస్తూ కొత్త పండుగను జరుపుకుంటున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఎక్కడెక్కడో చదువుకున్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా విడిపోయినప్పటికీ నేడు వాట్సప్ గ్రూప్‌ల ద్వారా చిన్ననాటి మిత్రులను చేరుకుంటున్నారు.

యాభై ఏళ్ల క్రితం పాఠశాల విద్య నభ్యసించిన వారు సైతం తమ మిత్రులను కలుసుకుంటూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు, ఆచార్యులకు సన్మానాలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఈ సమ్మేళనాలు ఇటు పూర్వ విద్యార్థులకు పాత జ్ఞాపకాలు మధురానుభూతి కలిగిస్తుండగా, గురువులను శిష్యుల కృతజ్ఞతా భావం ఆనందపరవశులను చేస్తోంది.

సండే స్పెషల్

### తొలితరం విద్యార్థుల సన్మానం మరువలేనిది..



ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన నేను 1982 నుంచి కొన్నేళ్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (పోచంపాడ్)లోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో ఉపాధ్యాయునిగా పని చేసాను. సుమారు 40 సంవత్సరాల తరువాత నా తొలి తరం విద్యార్థులు వాట్సప్ గ్రూప్ ద్వారా ఏకమై ఆచార్యులందరికీ సన్మానం చేయడం మరవలేని అనుభూతిని మిగిల్చింది.
– భగవాన్ దాస్, ఆచార్యులు, శ్రీసరస్వతీ శిశు మందిర్, పోచంపాడ్

### ఒక్కదగ్గరికి చేరడం ఆనందంగా ఉంది..



దేశ విదేశాలకు చెందిన నా చిన్ననాటి మిత్రులందరినీ ఒకరికి మరొకరిని మళ్లీ పరిచయం చేస్తూ వాట్సప్ గ్రూప్ ద్వారా ఒక్క చోటికి చేర్చడం చాలా ఆనందంగా ఉంది. ఫోన్ మెసేజ్‌లకే పరిమితం కాకుండా నిస్వార్థ సేవా రంగం వైపు మా గ్రూపును మళ్లించే ప్రయత్నం చేస్తున్నాము.
– లక్కం ప్రభాకర్, పశు వైద్యాధికారి, పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

### అమెరికా నుంచి వచ్చాను..



అమెరికాలో స్థిరపడ్డ నేను వాట్సప్ గ్రూప్ ద్వారా నా చిన్ననాటి మిత్రులను చేరుకోగలిగాను. ఆచార్యుల సన్మానం కార్యక్రమానికి అమెరికా నుంచి వచ్చి హాజరు కావడం.. నా మిత్రులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.
– రాధారపు అనురాధ, పూర్వవిద్యార్థిని

### చిన్న పిల్లలుగా మారిన ఆనందం



ప్రాథమిక పాఠశాల స్థాయి జ్ఞాపకాలను అదే మిత్రులతో నేడు నెమరువేసుకోవడం మళ్లీ చిన్న పిల్లల్లా మారిన అనుభూతిని మిగిల్చింది. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్న నేటి రోజుల్లో వాట్సప్ గ్రూప్‌లో ఒక్కటైన మేము సెల్‌ఫోన్ ఉపయోగించే ప్రతి ఒక్క రికీ ఆదర్శంగా నిలవాలనే ప్రయత్నం చేస్తున్నాము. విలువలతో కూడిన స్నేహాన్ని బలపర్చుకుంటాము.
– బుద్దె మీన, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పూర్వ విద్యార్థిని, పోచంపాడ్

### అద్భుతమైన అనుభూతి..



విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే నాకు చిన్ననాటి మిత్రుల వాట్సప్ గ్రూపు అద్భుతమైన అనుభూతిని ఇస్తోంది. అదే విధంగా వాట్సప్ గ్రూపుల్లో వివిధ రంగాలకు చెందిన వారిమంతా మిత్రులుగా మారి మా భావాలను ఒకరితో ఒకరం పంచుకుంటున్నాము.
– పోల శ్రీనివాస్, పూర్వ విద్యార్థి, పోచంపాడ్

### పలకరింపులతో సాన్నిహిత్యం పెరుగుతోంది..



ఎవరి వ్యాపకాలు వారికి ఉన్నా చిన్ననాటి మిత్రులు, ప్రస్తుత మిత్రులు వేరు వేరు గ్రూప్ సభ్యులమంతా ఒకరి నొకరం పలకరించుకోవడంతో మాలో సాన్నిహిత్యం పెరుగుతోంది. ఈ స్నేహాన్ని సమాజానికి ఉపయోగపడేలా మార్చి ఆదర్శంగా నిలిచే ప్రయత్నం చేస్తున్నాము.
– నాగమళ్ల కమల్, పూర్వ విద్యార్థి, పోచంపాడ్

## గ్రామస్థాయికి న్యాయ సేవల విస్తరణ



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత

**ఖలీల్‌వాడి:** చట్టాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని, గ్రామస్థాయికి న్యాయ సేవలను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయమూర్తి, న్యాయ సేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. రెండు నెలల కోసారి పెద్దఎత్తున నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ తోపాటు ప్రతిరోజూ లోక్ అదాలత్ నిర్వహిస్తూ కక్షిదారులకు న్యాయసేవలు అందిస్తున్నామన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ బస్వారెడ్డి మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రతిపౌరుడు పోలీస్ పాత్ర నిర్వర్తించాలన్నారు. అదనపు కలెక్టర్ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టబద్ధత కలిగిన లోక్ అదాలత్‌లు రాజమార్గంలో ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిర్చి వివాదాలను పరిష్కరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జీలు కుష్బూ ఉపాధ్యాయ్, గోపికృష్ణ, చైతన్య, హరికుమార్, శ్రీనివాస రావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**14,537 కేసుల పరిష్కారం**

జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 14,537 కేసులు పరిష్కారమయ్యాయి. 68 మోటార్ వెహికిల్ కేసుల్లో రూ.5.68 కోట్లు, 389 బ్యాంక్ కేసులను పరిష్కరించి రూ.2.22 కోట్లు, 14 భూ నష్టపరిహారం కేసులకు కింద రూ.61.37 లక్షలు, 39 సైబర్ క్రైం కేసులను సెటిల్ చేసి రూ.3.04 లక్షలు, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 149 కేసులకు రూ.1.11 లక్షలు అవార్డు అయినట్లు డీఎల్ ఎస్‌ఏ సూపరింటెండెంట్ కనిపెట్టి శైలజ తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి పవార్ గజేందర్ తరఫున ఆయన భార్య కుమారులు, కుమార్తె కలిసి ఉమ్మడిగా వేసిన మోటారు వాహన నష్ట పరిహార దావాలో వారి తరపు న్యాయవాది చిన్యా నాయక్, గో డిజిట్ జనరల్ ఇన్సురెన్స్ కంపెనీ న్యాయవాది సదానంద్‌గౌడ్‌తో సంప్రదింపులు జరిపి రాజీపద్ధతిన రూ.1.25 కోట్లకు లోక్ అదాలత్ ద్వారా అవార్డును అందజేశారు.

## కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- పాత మెనూ పాటిస్తే చర్యలు
- గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, బీసీ వసతి గృహాలను సందర్శించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- తరగతి గదులు, స్టోర్ రూమ్‌ల తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం



కోటయ్య క్యాంపు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నూతన డైట్ మెనూ ప్రారంభిస్తున్న కలెక్టర్



కోటగల్లి లోని ఎస్సీ వసతి గృహంలో పప్పులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతు

**వర్ని/నిజామాబాద్ అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన డైట్ మెనూ ప్రకారం గురుకుల, వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ శనివారం నిజామాబాద్ నగరంలోని కోటగల్లిలో గల బీసీ, ఎస్సీ వసతి గృహాలను, వర్ని మండలం కోటయ్య క్యాంపులోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు, స్టాఫ్ రూమ్, హెల్త్ రూమ్ ,లైబ్రరీ, స్టోర్ రూమ్, వంటగదిలోని నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం తీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం డైట్‌లో 40 శాతం, కాస్మోటిక్ లో 200 శాతం చార్జీలను పెంచిందన్నారు. మూడో తరగతి నుంచి ఏడవ తరగతి వరకు రూ. 950 నుంచి రూ. 1330 వరకు, 8వ తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ. 900 నుంచి రూ. 1540 వరకు చార్జీలను పెంచినట్లు తెలిపారు. పెంచిన చార్జీలకు అనుగుణంగా మెనూను పాటించాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు మంచి పౌష్టిక ఆహారం అందించాలనే ఉద్దేశంతో చార్జీలను పెంచినట్లు తెలిపారు. రెసిడెన్షియల్, ఆశ్రమ, మధ్యాహ్న భోజనాలను జిల్లా, మండల స్థాయి అధికారులు తరచూ తనిఖీలు చేసి పర్యవేక్షించాలని, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త డైట్ మెనూ కాకుండా పాత మెనూ ప్రకారం ఎవరైనా భోజనం పెడితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిపాలన అధికారి సహదేవ్, వర్ని తహసీల్దార్ సాయిలు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికార నర్సయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి భూమయ్య, వసతి గృహాల అధికారులు కల్పన తదితరులు ఉన్నారు.

## నకిలీ నోట్ల తయారీ ముఠా గుట్టు రట్టు

- చెలామణికి సిద్ధంగా ఉన్న రూ.56.90 లక్షలు స్వాధీనం
- ఆరుగురు నిందితుల అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధు శర్మ



వివరాలు తెలుపుతున్న కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ



నకిలీ కరెన్సీ, ముద్రణ సామగ్రిని చూపుతున్న కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ

**కామారెడ్డి టౌన్:** నకిలీ కరెన్సీ నోట్లు తయారు చేస్తూ చెలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగ నోట్ల తయారీ ముఠా గుట్టును జిల్లా పోలీసులు రట్టు చేశారు. ముఠాలో ఎనిమిది మందిని గుర్తించి ఆరుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ విషయమై శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధు శర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ పోలీసులు శుక్రవారం కొయ్యగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఓ కారులోని వ్యక్తులు పోలీసులను చూసి కారును వదిలి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ముగ్గురిని పట్టుకున్నారు. ఇందులో జిల్లాలోని బిచ్కుందకు చెందిన కోలావర్ కిరణ్‌కుమార్, బాన్సువాడకు చెందిన కె.రమేష్‌గౌడ్‌తోపాటు హైదరాబాద్ కొంపల్లికి చెందిన కడపత్రి రాజ్‌గోపాల్ ఉన్నారు. వారి వద్దనుంచి రూ. 30 లక్షల విలువ చేసే నకిలీ రూ. 500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రకు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడి దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. వీరిలో తెలంగాణకు చెందిన రాజగోపాల్, కర్ణాటకకు చెందిన హుసేన్ పీరా నకిలీ నోట్ల తయారీ, చెలామణిలో పెట్టుబడి పెడతారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కమలేష్, సుఖ్‌రాం, ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణలు కలిసి నకిలీ కరెన్సీని తయారు చేస్తారు. కామారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్ కుమార్, రమేశ్ గౌడ్, మహారాష్ట్రకు చెందిన అజయ్ ఈశ్వర్ వీటిని చెలామణి చేస్తున్నారు.

**పట్టుబడ్డారిలా..**

హైదరాబాద్‌లోని గౌలిగూడ, సీటీసీలలో నకిలీ నోట్ల తయారీకి అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసి బోయిన్‌పల్లిలోని అంటిలియా అపార్ట్‌మెంట్‌లో పెంట్‌హౌజ్‌లో ఇప్పటివరకు రూ.60 లక్షల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు ప్రింట్ చేశారు. ఇందులో రూ.3 లక్షలను బిచ్కుందకు చెందిన కిరణ్ కుమార్, బాన్సువాడకు చెందిన రమేష్ గౌడ్‌కు చెలామణి కోసం అప్పగించారు. వారు వాటిని చుట్టుపక్కల గ్రామాల్లో చెలామణి చేశారు. మరో రూ.30 లక్షలను హైదరాబాద్ నుంచి రాజగోపాల్ బాన్సువాడకు తీసుకువచ్చి కిరణ్‌కుమార్, రమేష్ గౌడ్‌లకు అప్పగించాడు. అయితే తిరిగి రాజ్‌గోపాల్‌ను బాన్సువాడ బస్టాండులో దింపడానికి కిరణ్ కుమార్, రమేష్‌గౌడ్‌లు కారులో బయలుదేరిన క్రమంలో బాన్సువాడలోని కొయ్యగుట్ట వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. రూ.30 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుల సమాచారం మేరకు హైదరాబాద్‌లో తనిఖీలు చేపట్టి మిగతా రూ.26.90 లక్షల విలువైన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నోట్ల తయారీకి వినియోగించే కంప్యూటర్ పరికరాలు, కలర్ ప్రింటర్, ఇంక్ బాటిల్స్, పేపర్ బెండల్స్, కట్టర్స్, కలర్ రిబ్బన్స్, నిందితులు వాడుతున్న టీఎస్17 జి 1036 నంబర్ గల వ్యాగన్‌ఆర్ కారు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజగోపాల్, హుసేన్ పీరా, కిరణ్ కుమార్, రమేష్ గౌడ్, రాధాకృష్ణ, అజయ్ ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ తెలిపారు. కమలేష్, సుఖ్‌రాంలు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి రూ.56 లక్షల 90 వేల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కేసును చురుకుగా ఛేదించిన సీసీఎస్ ఎస్సై శ్రీనివాస్, బాన్సువాడ పట్టణ, పిట్లం ఎస్సైలు అశోక్, రాజు, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, రాజేశ్వర్, ఏఎస్సై కిషన్, కానిస్టేబుల్స్ గణపతి, రాజేందర్, శ్రావణ్‌లను ఎస్పీ అభినందించారు.

## గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 19854 మంది అభ్యర్థులు.. 63 పరీక్ష కేంద్రాలు
- అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే హాజరు కావాలి : జిల్లా కలెక్టర్

**నిజామాబాద్ అర్బన్:** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నేడు, రేపు నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయి. ఈనెల 16న కూడా అవే సమయాలలో రెండు సెషన్‌లలో పరీక్షలు ఉంటాయి. జిల్లాలో మొత్తం 19854 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు నిశిత పర్యవేక్షణ చేయనున్నాయి, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయి. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్ష కేంద్రం లోనికి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరికీ లోనికి అనుమతి ఉండదు. పరీక్ష కేంద్రం లోనికి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వంటివి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్ష సమయం ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లడానికి వీలులేదు. అభ్యర్థులు తమ వెంట పరీక్ష హాల్ టికెట్, బ్లాక్/ బ్లూ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలి. ఏదేని ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్/ డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డు/ పాన్ కార్డ్/పాస్‌పోర్ట్ వంటివి) తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి. హాల్ టికెట్ పై కలర్ ఫొటో అతికించుకోవాలి. అభ్యర్థులు చెప్పులు వేసుకొని మాత్రమే పరీక్షకు హాజరు కావాలి. అభ్యర్థి వివరాలు ముద్రించబడిన ఓఎంఆర్ షీట్ పై నలుపు/ నీలం బాల్ పాయింట్ పెన్నుతో బబ్లింగ్ చేయాలని కలెక్టర్ జాగ్రత్తలు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సాఫీగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

## క్లుప్తంగా

### 19న అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌



నిజామాబాద్‌ నాగారం: జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌, నగర ట్రస్మా ఆధ్వర్యంలో 19న నాగారంలోని రాజారామ్‌ స్టేడియంలో ఉదయం 10 గంటలకు, అండర్‌ – 8, 10, 12, 14 పట్టణ ప్రైవేట్‌ పాఠశాలల బాలబాలికల అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ నిర్వహించనున్నట్లు ట్రస్మా నగర అధ్యక్షుడు ధర్మరాజు, జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్‌ తెలిపారు. నగరంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి స్కూల్‌ నుంచి ప్రతి ఈవెంట్‌లో ఇద్దరు పాల్గొనవచ్చన్నారు. బాలుర విభాగంలో 19 ఈవెంట్స్‌, బాలికల విభాగంలో 19 ఈవెంట్‌లలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. నగరంలోని అన్ని ప్రైవేట్‌ పాఠశాలలు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 16వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా పాఠశాలలు ఎంట్రీలు పంపించాలని, ఇతర వివరాలకు 99890 40776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### దేవాంగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్‌: జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని సీ కన్వెన్షన్‌ హాలులో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా కోటార్మూర్‌కు చెందిన గడ్డి ప్రకాశ్‌, ఉపాధ్యక్షుడిగా ఆలూర్‌ దొండ రమేశ్‌, కుంటాల గంగాధర్‌, ప్రధాన కార్యదర్శిగా రాస రాము, సంయుక్త కార్యదర్శులుగా కొండుక రాజేందర్‌, భూమేని రాజేందర్‌, గర్గుపల్లి రాస సురేశ్‌, అమీనాపూర్‌ గుండెం నవీన్‌, కోశాధికారులుగా నడిపి సత్యనారాయణ, ఇంద్రపు మహేశ్‌, రేగుల్ల గంగాధర్‌తోపాటు సభ్యులుగా 64మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి దేవాంగ రత్న, మాజీ కలెక్టర్‌ తొగర్ల చిరంజీవులు, తెలంగాణ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చోళ రాజేశ్వర్‌, సంయుక్త కార్యదర్శి బెన్కి నారాయణ, ఆయా గ్రామాల దేవాంగ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో విద్యార్థుల కోసం క్యాంటీన్‌ నిర్వహించేందుకు ఆసక్తిగల వారు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌ శనివారం తెలిపారు. కళాశాల పనిదినాల్లో క్యాంటీన్‌ నిర్వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# భోజన ఏజెన్సీలకు బకాయిల భారం

- 9, 10 తరగతుల బిల్లుల చెల్లింపులో జాప్యం
- కోడిగుడ్ల బిల్లులు చెల్లించని వైనం
- ఇబ్బందుల్లో ఏజెన్సీల నిర్వాహకులు



మోర్తాడ్‌ తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టి వారి ఆకలి తీరుస్తున్న కార్మికులకే పట్టెడు అన్నం కరువైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకపోయి ఏజెన్సీల కార్మికులు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాజాగా ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టిన బిల్లులకు సంబంధించి రూ.2,58,48,679 విడుదల చేసిన ప్రభుత్వం ఇతర బకాయిలను పక్కన పెట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించి నాలుగు నెలల బిల్లుల తోపాటు అన్ని తరగతుల విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించిన కోడిగుడ్ల బిల్లులను చెల్లించడం లేదు. ఉన్నత తరగతుల భోజనం బిల్లు, కోడిగుడ్ల సొమ్ము బకాయిలు మొత్తం జిల్లాలోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు రూ.3 కోట్ల వరకూ పేరుకుపోయాయి. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,234 ఉండగా, 2,524 మంది భోజన ఏజెన్సీల కార్మికులు ఉన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలను నిర్వహిస్తున్న కార్మికులు అంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనానికి సంబంధించి పౌర సరఫరాల శాఖ ద్వారా కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తారు.

కూరగాయలు, నూనె, పప్పులు, కోడిగుడ్లను కొనుగోలు చేయడం, సిలిండర్‌లను మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులే సమకూర్చుకోవాల్సి ఉంది. వీటి కొనుగోలు కోసం ఏజెన్సీలు అప్పులు చేస్తున్నాయి. నిత్యావసర సరుకుల ధరలను స్థానికంగా అరువు తీసుకుంటున్నా వ్యాపారులు వారం, పది రోజుల గడువు కాగానే సామగ్రి సొమ్మును అడుగుతున్నారు. బిల్లు బకాయిలు పేరుకుపోవడంతో ఏజెన్సీల కార్మికులు మహిళా సంఘాల్లో అప్పులు తీసుకుని సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ఏజెన్సీల కార్మికులు కోరుతున్నారు.

**ఏజెన్సీలు కష్టాల్లో ఉన్నాయి**

పాఠశాలల విద్యార్థులకు అన్నం కూరలు వండిపెట్టడానికి ఏజెన్సీల కార్మికులు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి సకాలంలో బిల్లులు చెల్లించాలి. పెంచిన వేతనం సైతం కార్మికులకు అందించాలి.

– చక్రపాణి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సంఘం నాయకుడు

# ఉత్సాహంగా వైద్యుల స్పోర్ట్స్‌ మీట్‌



నిజామాబాద్‌నాగారం: వయస్సులో సంబంధం లేకుండా వైద్యులు స్పోర్ట్స్‌ మీట్‌లో పాల్గొనడం అభినందనీయమని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌ మీట్‌లో భాగంగా శనివారం నగరంలోని నిశిత ఇంటర్నేషనల్‌ స్కూల్‌ మైదానంలో వైద్యులకు 100, 200 మీటర్ల రన్‌, వాలీబాల్‌ పోటీలను నిర్వహించారు. ఈనెల 25వ తేదీ వరకు ఫుట్‌బాల్‌, చెస్‌, క్యారం, వాలీబాల్‌, బాస్కెట్‌ బాల్‌, టేబుల్‌ టెన్నిస్‌, స్విమ్మింగ్‌, సైక్లింగ్‌, క్రికెట్‌ పోటీలు కొనసాగనున్నాయి. స్పోర్ట్స్‌ మీట్‌లో తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌ ఎథిక్స్‌ కమిటీ చైర్మన్‌ డాక్టర్‌ తోట కిరణ్‌కుమార్‌, ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, వైద్యులు ఆకుల విశాల్‌, హరీశ్‌స్వామి, శ్రీధర్‌రావు, అర్చన, బొద్దుల రాజేంద్రప్రసాద్‌, రాజేందర్‌ సూరినీడు, రషీద్‌ అలీ, ఫరీదాబేగం, నాగార్జున, దీపక్‌ రాథోడ్‌, దామోదర్‌రావు, జీవన్‌రావు, వినోద్‌ కుమార్‌ గుప్తా, రాజేశ్‌, చంద్రశేఖర్‌రావు, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌తో పాటు సుమారు వంద మంది వైద్యులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్‌ మీట్‌లో పాల్గొన్న వైద్యులు

# హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌ జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు

మాక్లూర్‌(ఆర్మూర్‌)/నిజాంసాగర్‌(జుక్కల్‌) : ఉమ్మడి జిల్లాలోని మాక్లూర్‌ మండలం కల్లెడి, జుక్కల్‌ మండలం కౌలాస్‌ ప్రభుత్వ పాఠశాలల మైదానాల్లో శనివారం సబ్‌ జూనియర్‌ హ్యాండ్‌ బాల్‌ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌ బాల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌ కుమార్‌ ఆదేశాల మేరకు ఎంపికలు నిర్వహించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గంగామోహన్‌, ప్రధాన కార్యదర్శి పింజా సురేందర్‌ తెలిపారు. కల్లెడిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 80 మంది హాజరుకాగా 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 27 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రెండో ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ సబ్‌జూనియర్‌ బాయ్స్‌ హ్యాండ్‌ బాల్‌ చాంపియన్‌ షిప్‌ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్‌ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆయా చోట్ల ఎంపికల్లో సంఘం కోశాధికారి జి రాజేశ్‌, సభ్యులు బి బాబు రావు, పీడీలు రమణ, మాధురి, కిశోర్‌, సతీశ్‌రెడ్డి, పీఈటీలు ప్రవీణ్‌, లింగం, సీనియర్‌ హ్యాండ్‌ బాల్‌ క్రీడాకారులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు

# టాస్క్‌ఫోర్స్‌ ఆఫీస్‌కు తాళం

- ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్‌
- బదిలీపై వెళ్లిన మిగతా సిబ్బంది
- రెణ్నెళ్లుగా తెరుచుకోని కార్యాలయం

ఖలీల్‌వాడి: జిల్లా పోలీసు శాఖలోని ముఖ్యమైన విభాగాలలో టాస్క్‌ఫోర్స్‌ ఒకటి. అక్రమ మొరం, ఇసుక, పీడీఎస్‌ దందా, పేకాట, మట్కా వంటి వాటిని టాస్‌ఫోర్స్‌ నిరోధిస్తుంది. అక్రమ దందాలను అరికట్టాల్సిన టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది అక్రమార్కులకే వత్తాసు పలకడంతో గత సీపీ కల్మేశ్వర్‌కు ఫిర్యాదులు అందగా ఆయన విచారణకు ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్‌ కానిస్టేబుళ్లు ఇద్దరు అవినీతికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో సస్పెండ్‌ చేశారు. రెండు నెలల క్రితం జిల్లాలో 70 మంది కానిస్టేబుళ్లను బదిలీ కల్మేశ్వర్‌ బదిలీ చేశారు. ఈ క్రమంలో సిబ్బంది ఖాళీ కావడంతో అప్పటి నుంచి టాస్క్‌ఫోర్స్‌ కార్యాలయానికి తాళం పడింది.

**అవినీతి ఆరోపణలతో..**

టాస్క్‌ఫోర్స్‌ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీపీ విష్ణుమూర్తిని డీజీపీ ఆఫీస్‌కు అటాచ్‌ చేశారు. ఇందులో ఇద్దరు సీఐలు ఉండగా అంజయ్య సీసీఎస్‌కు వెళ్లగా మరో సీఐ పురుషోత్తం బదిలీ అయ్యారు. ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఇద్దరు టాస్క్‌ఫోర్స్‌ కానిస్టేబుళ్లు రాములు, సుధాకర్‌ను సస్పెండ్‌ చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్‌ ఆఫీస్‌లో సిబ్బంది లేకుండా అయ్యారు. గతంలో కొంత మందిని ఉంచి మరికొంత మంది సిబ్బందిని బదిలీ చేసిన ఘటనలు ఉన్నాయి. ఇప్పుడు టాస్క్‌ఫోర్స్‌ ఆఫీస్‌ ఖాళీగా దర్శనం ఇస్తోంది. సీసీఎస్‌ ఏసీపీ నాగేంద్రచారికి టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్‌కు టీమ్‌ లేకపోవడంతో సీసీఎస్‌ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.



టాస్క్‌ఫోర్స్‌ కార్యాలయానికి వేసిన తాళం

**సీఐగా రమేశ్‌..**

ఖలీల్‌వాడి: మల్టీజోన్‌-1 పరిధిలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ చంద్రశేఖర్‌ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్‌ టాస్క్‌ ఫోర్స్‌ సీఐగా రమేశ్‌ను నియమించారు.

### అట్రాసిటీ కేసుపై త్వరలో విచారణ

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని కేఆర్‌కే అపార్ట్‌మెంట్‌ వద్ద ప్లాటు వివాదంలో మాజీ సీఎం కేసీఆర్‌ వియ్యంకుడు రాంకిషన్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆయన అనుచరులు నగేశ్‌, సూదం రవిపై సైతం కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో ఏసీపీ ఆధ్వర్యంలో త్వరలో విచారణ చేపట్టిన అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరీఫ్‌ శనివారం తెలిపారు. ఈ కేసుపై సోషల్‌ మీడియాతోపాటు పత్రికల్లో చర్చసాగుతోంది.

### సీఐఎస్‌ఎఫ్‌కు పద్మాజీవాడి యువకుడి ఎంపిక



సదాశివనగర్‌: మండలంలోని పద్మాజీవాడి గ్రామానికి చెందిన మామిండ్ల భగత్‌ సీఐఎస్‌ఎఫ్‌లో ఉద్యోగం సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల వెలువడ్డ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. యువకుడికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# న్యూసెన్స్‌ చేసిన వ్యక్తి రిమాండ్‌

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎదుట న్యూసెన్స్‌ చేసిన బురుడుగల్లీకి చెందిన జంబిలం దిలీప్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై యాసీన్‌ అరాఫత్‌ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జల్సాలకు అలవాటు పడిన దిలీప్‌ డబ్బుల కోసం తన తల్లినికొట్టేవాడు. ఈ నెల 9వ తేదీన సైతం డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరించడంతో ఆమె డయల్‌ 100కి కాల్‌ చేసింది. పోలీస్‌ సిబ్బంది వాళ్లింటికి వెళ్లగా, దిలీప్‌కు భయపడి అతనిపై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు తల్లి రాగా అమె వెనకాలే ఇంట్లో నుంచి కూరగాయల కత్తిని తీసుకొని వచ్చాడు. తల్లి డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని తను తెచ్చుకున్న కత్తితో మెడ, చాతి కుడి భాగంపై గాయపర్చుకోవడంతో గమనించిన పోలీసులు జీజీహెచ్‌కి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనూ ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా డాక్టర్లతో దిలీప్‌ అసభ్యంగా ప్రవర్తించి న్యూసెన్స్‌ చేశాడు. ఈ నేపథ్యంలో దిలీప్‌పై కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దిలీప్‌కు న్యాయస్థానం 14 రోజుల జ్యుడిషియల్‌ రిమాండ్‌ విధించిందని ఎస్సై తెలిపారు. జంబిలం దిలీప్‌పై ఇప్పటికే టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నాయన్నారు.

### పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని కొత్త బస్టాండ్‌ వద్ద విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీఎస్పీ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి డీసీఎంలో తరలిస్తున్న 21 టన్నుల పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నారని, డీటీ వినోద్‌ పంచనామా నిర్వహించారన్నారు. నిందితులైన డీసీఎం డ్రైవర్‌ జాకీర్‌, డీసీఎం యజమాని రావూఫ్‌, మదనం ఎల్లయ్యను స్టేషన్‌లో అప్పగించారని తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## క్రైం కార్నర్‌

### అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు



మాక్లూర్‌: రెండు రోజుల క్రితం అదృశ్యమైన మండలంలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన తొర్లికొండ సురేశ్‌ (37) శనివారం రాత్రి ముల్లంగి (బి) శివారులోని బొడగుట్ట ప్రాంతంలో శవమై కనిపించాడు. ఈనెల 13న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన సురేశ్‌ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఉదయం సురేశ్‌ భార్య భవ్యశ్రీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి 7గంటల సమయంలో ముల్లంగి(బి) శివారులోని బొడగుట్టపై చెట్టుకు సురేశ్‌ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేశ్‌ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

### చెరువులో గేదెల కాపరి గల్లంతు

బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్ల గ్రామ చెరువులో గేదెల కాపరి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరి మండలం కొత్తపల్లికి చెందిన మక్కల చిన్న సాయిలు(40) భార్య నవనీతతో కలిసి రెంజర్లలో ఉంటూ పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. భార్యాభర్తలు శనివారం గేదెలను మేపేందుకు వెళ్లారు. చెరువులోకి దిగిన గేదెలను బయటికి తీసుకువచ్చే క్రమంలో చిన్నసాయిలు నీటిలో మునిగిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందింగా వారు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు.

### కామారెడ్డిలో చైన్‌ స్నాచింగ్‌



విచారిస్తున్న పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌ కాలనీలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి దుండగులు 3 తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన రాగుల భాగ్యమ్మ అనే మహిళా ఇంటికి దగ్గరలోని కిరాణా దుకాణానికి ఉదయం 8గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చారు. ఓ వ్యక్తి బైక్‌ దిగి భాగ్యమ్మ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కుని బైక్‌పై పరారయ్యారు. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### సెల్‌ఫోన్‌లు అప్పగింత



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ పరిధిలో రైళ్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి సెల్‌ ఫోన్‌లను తిరిగి అందజేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. డిసెంబర్‌ నెలలో రైళ్లలో ప్రయాణం చేస్తున్న సమయంలో పలువురు ఫోన్‌లు పోగొట్టుకుని తమకు ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్‌ అప్లికేషన్‌ ద్వారా పది ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. రైళ్లలో సెల్‌ఫోన్‌లు పోతే రైల్వే పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని అశానగర్‌ కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కళ్యాపూర్‌కు చెందిన కాశం సాయిలకు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. నవీపేట నుంచి కళ్యాపూర్‌కు బైక్‌పై సాయిలు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన మరో బైక్‌ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ఘటనపై ఎస్సై వినయ్‌ని వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

### ఒకరి బైండోవర్‌

మాచారెడ్డి: మద్యం మత్తులో డయల్‌ 100కు కాల్‌చేస్తూ పోలీసుల సమయాన్ని వృథా చేస్తున్న సోమారంపేట గ్రామానికి చెందిన బానోత్‌ రమేశ్‌ను శనివారం మాచారెడ్డి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. డయల్‌ 100ను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పని ఎస్సై స్పష్టం చేశారు.

### పర్సు చోరీకి యత్నం

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అనిత అనే మహిళ బస్సు ఎక్కువుతున్న క్రమంలో వెనుక నుంచి ఓ మహిళ ఆమె పర్సును కాజేసే ప్రయత్నం చేస్తుండగా ఉన్న ఆర్టీసీ పోలీసులు ఆమెను పట్టుకున్నారు. అనంతరం సదరు మహిళను ఆర్మూర్‌ పోలీసులకు అప్పగించి పర్సును ప్రయాణికురాలికి అప్పగించారు.